
యువకులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

రియల్ హీరోస్

● **వరద నీటిలో చిక్కుకున్న వారిని కాపాడిన యువకులకు సన్మానం**

ముషీరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రాంనగర్ ఆశీర్వాద్ అపార్ట్‌మెంట్ వెనుక వీధిలో వరద నీటి ప్రవాహంలో కారులో ఐదుగురు కొట్టుకుపోతుండగా కాపాడిన యువకులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ అభినందించారు. ప్రణీత్ యాదవ్, మోహన్ యాదవ్, మార్టిన్, నాగచారిని సోమవారం సన్మానించారు. వరద నీటిలో కారు కొట్టుకుపోతుండగా అద్దం పగులగొట్టి అందులో ఉన్న వారిని కాపాడిన విషయాన్ని కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి యువకులకు ప్రోత్సాహం అందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ కూడా యువకులను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పైపులైన్ వేసిన రెండు నెలలకే కుంగిన రోడ్డు


కుంగిన రోడ్డును పరిశీలిస్తున్న పలు పార్టీల నాయకులు

కవాడిగూడ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పైపులైన్ వేసిన రెండు నెలలకే రోడ్డు కుంగిపోయింది. బీమా మైదాన్ సమీపంలో రూ. 6 లక్షల వ్యయంతో డ్రైనేజీ పైపులైన్ వేసి రోడ్డుకు ప్యాచ్‌వర్క్ పనులు చేశారు. సోమవారం పైపులైన్ వేసిన స్థానంలో రోడ్డు కుంగిపోయింది. విషయం తెలుసుకున్న బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు అక్కడికి చేరుకొని వాటర్‌వర్క్స్ మేనేజర్ శ్రీధర్, అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు రోడ్డును పరిశీలించి కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి కుంగిన రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. కుంగిన రోడ్డును బీజేపీ రాష్ట్ర నాయకుడు జి. వెంకటేష్, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎంసీ మహేందర్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ సాయికృష్ణ, బీఆర్ఎస్ నాయకులు బల్లేకారి రమేష్, ఎ. ప్రభాకర్ తదితరులు పరిశీలించారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

రాంనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో సోమవారం రాంనగర్ చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. నాగరాజు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు యశ్వంత్, ప్రశాంత్, నరేష్, సురేష్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులు సచివాలయ ముట్టడి పిలుపు నేపథ్యంలో..

గ్రంథాలయం, అశోక్‌నగర్‌లో పోలీసు బందోబస్తు


అశోక్‌నగర్ చౌరస్తాలో పోలీస్ బందోబస్తు

చిక్కడపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు సచివాలయ ముట్టడి పిలుపు సందర్భంగా చిక్కడపల్లిలోని హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ, అశోక్‌నగర్ చౌరస్తా, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. గ్రూప్- 2, 3 పోస్టులు పెంచాలని, గ్రూప్-2 పరీక్ష వాయిదా వేయాలని నిరుద్యోగులు శనివారం రాత్రి 7.30 గంటల నుంచి ఆదివారం తెల్లవారు ఝాము 4.30 గంటల వరకు అశోక్‌నగర్ చౌరస్తాలో ధర్నా చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు చౌరస్తాలో బారికేడ్లు ఏర్పాటు చేసి అశోక్‌నగర్ నుంచి ప్రాగాటూల్స్‌వైపు, ఆర్‌సిరెడ్డి కోచింగ్ సెంటర్ నుంచి హిమాయత్‌నగర్ వై జంక్షన్‌కు వెళ్లే దారిలో రాకపోకలను నిషేధించారు. బీఆర్ఎస్‌వీ నేత మిద్దెసురేష్, ఏబీవీపీకి చెందిన ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.


అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

పిల్లలను అంగన్‌వాడీ పాఠశాలలో చేర్పించండి

బర్కత్‌పుర, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ మోతీలాల్‌నెహ్రూనగర్‌లోగల అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం 'అమ్మబాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి మాట్లాడుతూ.. ఐదేళ్లలోపు బాలబాలికలను అంగన్‌వాడీ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. బాల, వ్రతం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఏక్‌మినార్ వద్ద డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

ముషీరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ ఏక్‌మినార్ వీధిలో అమీర్ గరీబ్ దుకాణాల వద్ద రోడ్డుపై నిత్యం డ్రైనేజీ నీరు ఏరులై పారుతుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం జలమండలి జీఎం రామకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. గత ఏడాది నుంచి ఫిర్యాదు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. బిలాల్ మసీద్ వద్ద డ్రైనేజీ నీరు సెల్లార్‌లలో నిండిపోతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కరీం, ఎగ్బాల్ అహ్మద్, నియాజ్, అజ్గర్, జలమండలి సెక్షన్ మేనేజర్ ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.


జలమండలి జీఎం రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న వాజిద్ హుస్సేన్

హామీలను అమలు చేయాలి : ఉద్యమకారులు


అభివాదం చేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు సుల్తాన్‌యాదగిరి, ప్రఫుల్‌రాంరెడ్డి, వెంకటస్వామి తదితరులు

రాంనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని పలువురు ఉద్యమకారులు, ఉద్యమ సంఘాల వక్తలు డిమాండ్ చేశారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమ కారుల సమితి చైర్మన్ సుల్తాన్‌యాదగిరి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. తెలంగాణ ఉద్యమకారులు తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి, గద్దర్ కుమార్తె వెన్నెల, బోయపల్లి రంగరాడ్డి, నల్లా రాధాకృష్ణ, బత్తుల సోమయ్య, మంచాల వెంకటస్వామి, చంద్రుడు,.కె చంద్రశేఖర ప్రసాద్, అన్వర్‌పటేల్, వెంకటనారాయణ, కొండాస్వామి, బాబు,. సాయి మాట్లాడారు. ఉద్యమకారులపై పోలీసు కేసులు ఎత్తివేయాలని, తొలి దశ ఉద్యమ కారులకు గుర్తింపు పత్రాలు ఇవ్వాలని, ప్రతి ఉద్యమ కారుడుకి 250గజాల స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. పింఛన్ ఇవ్వాలని, ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని, రూ. 20 లక్షల ఆరోగ్య బీమా ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలలో ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాలని, వంద ఎకరాలలో అమరవీరుల స్మృతి వనం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. సమావేశంలో ఉద్యమకారులు ఏలూరి బాబు, యాదగిరి స్వామి, అరుణ, ఇందిర, మంజుల, రేణుక, కుర్మయ్య, లలిత తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోండి

కట్టమైసమ్మ బోనాలపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

కవాడిగూడ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బోనాల పండుగ సందర్భంగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశించారు. సోమవారం దేవాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 28న బోనాలు, 29న రంగం కార్యక్రమాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బోనాల సందర్భంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. ఆలయ పరిసరాల్లో వీధి దీపాలకు మరమ్మతులు చేయాలన్నారు. కార్పొరేటర్ రచనశ్రీ మాట్లాడుతూ.. ఆలయం వద్ద తాత్కాలిక షెడ్లు నిర్మించే స్థలం డంపింగ్ యార్డుగా మారిపోయిందన్నారు. శాశ్వత షెడ్లు ఏర్పాటుచేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు కోరారు.

సమావేశంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ గోల్కొండ గౌతమ్‌కుమార్ పటేల్, సర్కిల్-15 డీఎంసీ మొయినుద్దీన్, చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ వీరేశం, హిమాయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖవాణి, దోమలగూడ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఎంహెచ్‌వో మైత్రేయి, ఎలక్ట్రిసిటీ ఏఈ జ్యోతిర్మయి, వాటర్‌వర్క్స్ మేనేజర్ శ్రీధర్, కట్టమైసమ్మ ఆలయ ఈవో సాంబశివరావు, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు గంగపుత్ర సంఘం రోడ్డుకు మోక్షం


తవ్విన రోడ్డును పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ముషీరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు భోలక్‌పూర్ గంగపుత్ర సంఘం వీధి, భోలక్‌పూర్ హౌస్ జెండా గల్లీ రోడ్ల నిర్మాణానికి మోక్షం లభించింది. నిధులు మంజూరై 9 నెలలు అయిన తర్వాత రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. తవ్వి వదిలేయడంతో స్థానికులు బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ దృష్టికి తీసుకెళ్లగా.. సోమవారం జీహెచ్ఎంసీ డీఈ సన్నీ, ఏఈ సుభాష్‌కు సమస్యను వివరించారు. వెంటనే రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలని అధికారులను కోరారు. రోడ్డును తవ్వి వదిలేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, యువజన కమిటీ అధ్యక్షుడు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల బదిలీ యోచనను విరమించుకోవాలి


మాట్లాడుతున్న చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్

నల్లకుంట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అనువంశికంగా, వంశపారంపర్యంగా ఆలయాలలో విధులు నిర్వహిస్తున్న అర్చకులను బదిలీ చేయాలనే యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్ డిమాండ్ చేశారు. సోమవారం నల్లకుంట డివిజన్ నర్మదా భవన్‌లోగల చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అర్చకుల సమావేశం జరిగింది.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఒక్కో ప్రాంతంలోని ఆచార వ్యవహారాలు, ఆగమ పద్ధతులు వేర్వేరుగా ఉంటాయని, తరతరాలుగా అర్చకుల వారసులే వారసత్వంగా వృత్తిని చేపట్టి స్థానిక ఆగమ శాస్త్ర పద్ధతుల ప్రకారం ఉత్సవాలు, అర్చనలు నిర్వహిస్తుంటారన్నారు. అర్చకులను బదిలీ చేస్తే వారి కుటుంబాలు వీధిన పడడంతోపాటు దేవాలయాలలో అర్చన విధానాలు, పద్ధతులు మారిపోతాయన్నారు.

కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అర్చకులు తిరునగరి సంపత్‌కుమార్, శ్రీరాములు, వెంకట్‌పూజారి ముకుంద్, తంబిరాజు, శ్రీకృష్ణ, కురుమూర్తి శ్రీరాములు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైశ్య హాస్టల్ విద్యార్థులు

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

బర్కత్‌పుర, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వైశ్య హాస్టల్ విద్యార్థులు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని జ్ఞాననిధి సేవా ట్రస్ట్ చైర్మన్ ఎం. శ్రీనివాస్ సూచించారు. కాచిగూడలో సోమవారం సాయంత్రం నిర్వహించిన వైశ్య హాస్టల్ డేలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మెదడుకు పదును పెట్టినప్పుడే విద్యార్థులు రాణించగలుగుతారన్నారు. ఈ సందర్భంగా క్రీడా, సాంస్కృతిక రంగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హాస్టల్ అధ్యక్షుడు ఉప్పల రాజేశ్వర్, ట్రస్ట్ బోర్డు చైర్మన్ జి. ధనుంజయ, స్పోర్ట్స్ చైర్మన్ బి. శ్రీనివాస్, ట్రస్ట్ బోర్డు కార్యదర్శి విశ్వనాథం నాగేష్, కోశాధికారి కె. రఘువీర్, హాస్టల్ ప్రధాన కార్యదర్శి రవిప్రసన్నకుమార్, కోశాధికారి రాజేశ్వర్ రావు, స్పోర్ట్స్ కో - చైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


వైశ్య హాస్టల్ వేడుకలను ప్రారంభిస్తున్న శ్రీనివాస్

అషుర్‌ఖానాలో ఎమ్మెల్యే ప్రార్థనలు


ప్రార్థనలు చేసిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట/రాంనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట శంకరమఠం కూరగాయల మార్కెట్ ఎదుటి వీధిలోగల అషుర్‌ఖానాలో మొహర్రం పర్వదినం 8వ రోజును పురస్కరించుకుని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, నల్లకుంట, బాగ్‌అంబర్‌పేట డివిజన్ల కార్పొరేటర్లు యాకర అమృత, బి. పద్మావెంకటరెడ్డి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఎం. మధుసూదన్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకురాలు ఇర్ఫానా సుల్తానా తదితరులు పాల్గొన్నారు. బాగ్‌అంబర్‌పేటలో జరిగిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కె. పద్మావతిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మొహర్రం త్యాగానికి ప్రతీక అని అన్నారు.

జనసేన జెండాలో..

శ్రీచక్ర యంత్రాన్ని పెట్టడం అన్యాయం


జనసేన జెండాలో శ్రీచక్ర యంత్రాన్ని చూపిస్తున్న కమల సంతోష్‌కుమార్

రాంనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పరబ్రహ్మ స్వరూపం అయిన ఆదిపరాశక్తి అమ్మవారి శ్రీచక్ర యంత్రాన్ని జనసేన పార్టీ తన జెండాకు ఉపయోగించడం అన్యాయం అని, ఇది అమ్మవారిని, హైందవ ధర్మాన్ని అవమానించడమేనని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కమల సంతోష్‌కుమార్ అన్నారు. రాజకీయాలకు అమ్మవారి చిహ్నాన్ని ఉపయోగించుకోవడం హిందూ ధర్మాన్ని తుంగలో తొక్కడమేనని వాపోయారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జనసేన పార్టీలో శ్రీచక్ర యంత్రం చిహ్నాన్ని అనుమతించిన కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులు బాధ్యత వహించాలన్నారు. దీనిపై డీజీపీ జితేందర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పునరాలోచించి శ్రీచక్ర యంత్రాన్ని జెండా నుంచి ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ విషయంపై ఆదిపరాశక్తికి క్షమాపణ చెప్పడంతో రుద్రాభిషేకం, శాంతి హోమాలను రాష్ట్రవ్యాప్తంగా పవన్ కల్యాణ్ తన సొంత ఖర్చులతో నిర్వహించాలని ఆయన కోరారు. పార్టీ జెండాలో శ్రీచక్ర యంత్రాన్ని తొలగించకపోతే న్యాయ పోరాటం చేస్తానన్నారు.

'ఎమరాల్డ్' యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

● **ప్రజావాణిలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడి ఫిర్యాదు**

ముషీరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఉత్పత్తులతో స్వీట్లు తయారు చేస్తున్నామని ప్రజలను నమ్మించి మోసం చేస్తున్న ఎమరాల్డ్ మిఠాయి దుకాణ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లవెల్లి అంజిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో ఎమరాల్డ్ స్వీటు షాపుపై ఫిర్యాదు చేశారు.

ఇందిరాపార్కు వద్దగల ఎమరాల్డ్ షాపుతోపాటు నగరంలో వివిధ ప్రాంతాలలో స్వీటు షాపులను ఏర్పాటు చేసి నాణ్యత లేని బెల్లం, జీడిపప్పు తదితర వాటిని వాడడంతోపాటు అపరిశుభ్రత వాతావరణంలో స్వీట్లను తయారు చేసి ప్రజలకు అంటగడుతున్నారని ఆరోపించారు.

ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్న ఎమరాల్డ్ స్వీటు షాపుల యజమానిపై చర్యలు తీసుకొని, లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఈస్ట్‌జోన్ డీసీపీగా బాలస్వామి బాధ్యతల స్వీకరణ



బర్కత్‌పుర, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్‌జోన్ డీసీపీగా బాలస్వామి నియమితులయ్యారు. సోమవారం ఆయన అంబర్‌పేటలోని ఈస్ట్‌జోన్ డీసీపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 2018 బ్యాచ్ ఐపీఎస్ అధికారి బాలస్వామి నాగర్ కర్నూలు జిల్లా తెలకపల్లి మండలానికి చెందిన వారు. గతంలో రాచకొండ ఎస్‌బీ, సౌత్ ఈస్ట్‌జోన్ డీసీపీగా, మెదక్ ఎస్పీగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జోన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలను పట్టించుకోని జీహెచ్ఎంసీ

రాంనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షం వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం, జీహెచ్ఎంసీ పట్టించుకోవడం లేదని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా ఆరోపించారు. సోమవారం టీడీపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీహెచ్ఎంసీ ఎమర్జెన్సీ స్క్వాడ్ ఎక్కడుందని ప్రశ్నించారు. ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తున్న జీహెచ్ఎంసీ ఆపదలో ఉన్న ప్రజలను పట్టించుకోవడం లేదని వాపోయారు. సమావేశంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి. బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు ఎస్. ప్రకాష్, భాను తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

బర్కత్‌పుర, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణచారి తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ దూద్ బావి వద్ద నివసిస్తున్న గణేష్(31) కూలీ పనిచేస్తూ జీవిస్తున్నాడు. ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. భార్య గొడవపడి ఇటీవల పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమె రానని చెప్పడంతో గణేష్ మనస్తాపం చెందాడు.

సోమవారం సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్‌లో రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ముఖ్యమంత్రిని కలిసిన క్రీడాకారులు

క్రీడాకారులకు ముఖ్యమంత్రి అభినందనలు

బర్కత్‌పుర, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఖేలో భారత్ యూత్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్జాతీయ చాంపియన్‌షిప్‌లో మెడల్స్ సాధించిన క్రీడాకారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. క్రీడాకారులు సోమవారం ముఖ్యమంత్రిని కలిశారు. నేపాల్‌లో జరిగిన యూత్ గేమ్స్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలలో రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో ఆరు బంగారు, రెండు రజిత పతకాలు సాధించారు. సాయిహస్విక అండర్ - 17 ఎయిర్ రైఫిల్‌లో గోల్డ్, సిల్వర్ మెడల్, సర్దార్ అంగద్ సింగ్ సిద్ధూ అండర్ - 17 ఎయిర్ రైఫిల్‌లో గోల్డ్, సిల్వర్, సురేందర్ అండర్ - 25 పిస్టల్ విభాగంలో గోల్డ్, రాథోడ్ సంతోష్ అండర్ - 30లో బ్రేక్ బారెల్ విభాగంలో గోల్డ్, సిల్వర్ మెడల్, బైరగోని అరుణ్‌కుమార్ ఓపెన్ క్యాటగిరి ఎయిర్ రైఫిల్‌లో గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించారు.

మహంకాళి ఘటం ఊరేగింపు

నల్లకుంట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట మహంకాళి ఆలయంలో అమ్మవారి ఘటం ఊరేగింపు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊరేగింపు ప్రధాన రహదారిలోని బొడ్రాయి వరకు చేరుకుంది. అక్కడ పూజలు నిర్వహించిన అనంతరం తిరిగి ఆలయ వద్దకు ఊరేగింపు చేరుకుంది. ఈ సందర్భంగా బోనాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి. పద్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ బి. వెంకటరెడ్డి, అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆర్గనైజర్ కె. దుర్గాప్రసాద్‌రెడ్డి, చైర్మన్ పంజాల జ్ఞానేశ్వర్‌గౌడ్, వైస్ చైర్మన్ గడ్డం లక్ష్మణ్‌గౌడ్, అధ్యక్షుడు వై. శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రంగంపల్లి రాజు, ప్రధాన కార్యదర్శి బింది మల్లికార్జున్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో వంశీధర్‌కు సిల్వర్ మెడల్


మెడల్ సాధించిన డాక్టర్ వంశీధర్ నాలి

బర్కత్‌పుర, జూలై 15 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో నిర్వహించిన 1వ విశ్వ ఓపెన్ నేషనల్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలలో డాక్టర్ వంశీధర్ నాలి 60 కిలోల కేటగిరిలో సిల్వర్ మెడల్ సాధించారు. వెటరన్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బీకే మిశ్రా చేతుల మీదుగా మెడల్ అందుకున్నారు. కార్యక్రమంలో మేజర్ జనరల్ గగన్ దీప్‌భక్షి, బీజే సింగ్, వెటరన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ లెంక, నేషనల్ సెక్రటరీ జనరల్ డి. సురేష్ పాల్గొన్నారు.

సన్మానం



ఇటీవల టీ-20 వరల్డ్ కప్ సాధించిన భారత క్రికెట్ జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా విధులు నిర్వహించిన నగరానికి చెందిన టి. కె. దిలీప్‌ను కాచిగూడ శ్యామ్‌బాబా మందిర్‌లో హనుమాన్ దేవాలయ మేనేజర్ వరద రాజులు ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. **- బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి**

దుర్గాబాయి దేశ్‌ముఖ్‌కు నివాళి


దుర్గాబాయి దేశ్‌ముఖ్‌కు నివాళులర్పిస్తున్న డీడీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

రాంనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): డీడీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ 115వ జయంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోగల ఆమె విగ్రహానికి అసోసియేషన్ అధ్యక్షుడు కొండా లక్ష్మీకాంతరెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ గౌతమ్‌రావు, పి. గోవర్ధన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు ఉమాశంకర్, ప్రసన్న, పాండురంగయ్య, హరిచరణ్, కిరణ్ రెడ్డి, సుబ్బారెడ్డి, రఘువీర్‌రెడ్డి, రాంరెడ్డి, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోబీల వద్ద నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ఓవర్ బ్రిడ్జ్, రోడ్డు అండర్ బ్రిడ్జ్‌ల వద్ద నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అన్నారు. సోమవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో అదనపు జనరల్ మేనేజర్ ఆర్.ధనుంజయులుతో కలిసి వివిధ శాఖాధిపతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం అయ్యారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఆర్వోబీ, ఆర్‌యూబీల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వీటి వద్ద నీరు నిలువకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకోవాలని, నీరు వెళ్లేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు ఏర్పాటు చేయాలని, నీటి పంపింగ్ వ్యవస్థలను అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. భద్రతకు సంబంధించి 24 గంటలు ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. సమావేశానికి సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజనల్ రైల్వే మేనేజర్లు హాజరయ్యారు.